# చావూ నీకెప్పుడు చావు?

'చనిపోయిన మనిషి పాత చెప్పుకంటే హీనం' అంటే శివుడు ఒప్పుకోడు. కారణం చనిపోయిన మనుషుల కనాలే ఈనాటి అతడి వ్యాపారానికి సరుకులు కావడమే.

కష్టానికీ, కన్నీళ్ళకు కారణాన్ని అన్వేషిస్తూ తిరిగి తిరిగి అలసి పోయిన గౌతమునికి—అనుకోకుండా జ్ఞానోదయమయి "భగవాన్ బుద్ధుడయి నట్లు - మంచంలో తల్లిని, కంచం ముందున్న భార్యాబిడ్డలను పోషించు కోవాలని తిరిగి తిరిగి విసిగిపోయిన శివుడికి "శవాల వ్యాపారం" బ్రతుకు తెరువయింది చివరికి.

శవాన్నికూడా స్మశానానికి చేర్చలేని దరిద్రులు దిక్కులేక, దిక్కు దిక్కు మంటూ ఏడుస్తూవుంటే వాళ్ళ దరిచేరతాడు శివుడు, తానూ కన్నీరు కారుస్తూ వాళ్ళ బాధలోభాగం పంచుకుంటాడు. వాళ్ళను ఓదార్చి, శవాన్ని తనే పూడ్చి వస్తానని చెప్పి ఒప్పిస్తాడు.

పాత గోనె సంచిల్లో మోసుకొచ్చిన శవాన్ని తన గుడిసె ముందు చీకిపోయిన మరో గుడిసెలో వుంచుతాడు.

ఉదయాన్నే ఓ ఇద్దరు తాగుబోతు పెద్దమనుషులు వస్తారు అక్కడికి. ఆ శవాన్ని ఐదు రూపాయలకు కొనుక్కొని పోతారు. ఒక్కొక్క సారి యింకా ఎక్కువే యిస్తారు. పసిపిల్లల శవాలయితే మరీ లాభం వుంటుంది.

పెద్ద మనుషులు ఆశవాన్ని తీసుకెళ్ళి రైల్వేస్టేషన్ కూడలిలోనో బస్టాండు దగ్గరో సినిమాహాలు ముందరో మార్కెట్టు దారిలోనో వుంచి పూలుచల్లి అగరవత్తులు వెలిగించి "పేదోల్లం బాబూ! కర్మ సెయ్యాలి....

దానం సెయ్యండి బాబులూ!” అంటూ డబ్బులు అడుక్కుంటారు, సాయం కాలం వరకు. అప్పటికే గబ్బుపట్టిన ఆశవాన్ని ఆ తరువాత ఏ కాలవ లోనో తోసి పారేస్తారు.

చాలా డబ్బులొస్తాయి. బాగా తాగి తందనాలు ఆడుతారు జల్సాలు చేసుకుంటారు.

“ఆపని తనే చేస్తే ఏంటి”?—అనుకోకుండా వుండలేక పోయాడు శివుడు. కానీ, పేదోళ్ళయినా శవం తాలూకువాళ్ళ కళ్ళు తనపైపడితే అసలుకే మోసం వస్తుందన్న భయంతో వున్న ఉద్యోగంతోనే సరిపెట్టు కున్నాడు. రెండు మూడు శవాలు దొరికినరోజు మరీ హోల్ సేల్ గా వుంటుంది వ్యవహారం. ఆరోజు పండగే.

అది పెద్ద పట్టణం కాబట్టి ఫరవాలేదు. రోగంతోనో, ఆకలితోనో ఎవరోఒకరు చస్తూనే వుంటారు.

మంచంలోవున్న శివుడి తల్లి ఆ శవాలపని మానుకోమని ఒకటే పోరు. “బిడ్డలుగల్లోడివి ఆపని సెయికు” అంటూ రోజూ రోదన. అమ్మో, సాయంకాలం అయ్యేసరికి సారా మింగకపోతే బతికినట్లె వుండదు. యీ వ్యాపారం పట్టాక సారా ఘాటు శివుడిని వదలడంలేదు. మరింత గట్టిగా వాటేసుకుంది.

పెళ్ళాం ప్రతి ఏడూ బాలింతె! ప్రతి ప్రసవం ఒక మృత్యు ముఖం! పుట్టిన ప్రతి బిడ్డా ఒక దీపం!! “నీ సెవాన్ని మాత్తరం అమ్మను లేయే. భయపడమాకు, నువ్ మాయమ్మవు, నిన్ను నేనే పూడుస్తా మట్లో శివుడు తల్లికి హామీ యిచ్చాడు.

“ఒరే!....ఏదో చెప్పబోయింది తల్లి. ఛా! నీయమ్మ....యిట్టాగే సెబితే నిన్నూ అమ్మేసి, తాగేస్తా నాయాల్ది” అంటూ బిగ్గరగా నవ్వాడు. శివుడు. ఆ రోజు ఇద్దరిబిడ్డల శవాలు దొరికితే, అమ్మేసి బాగా తాగొచ్చాడు ఇంటికి. పెద్దగా అలా నవ్వితే గండు మీసాలతో, ఎరుపెక్కిన కళ్ళతో యమధర్మరాజులా వుంటాడు శివుడు.

పిల్లలు భయపడి వాళ్ళమ్మ చాటున దాక్కుంటారు పెళ్ళాంకూడా గడగడలాడి పోతుంది. బిడ్డల్ని గట్టిగా పట్టుకొని, అంత భయంకరంగా వుంటాడు. శవాన్ని పీక్కుతినే రాబందని అందుకే తిడుతూ వుంటుందేమో శివుడి తల్లి,

తాగిందితాగి, మిగిలిన డబ్బుకు హెూటళ్ళలో విసిరేసిన విస్తర్ల లోంచి పోగుచేసి కలబోసిన అన్నం టెంకాయ చిప్ప కొలతతో మరింత తీసుకొస్తాడు. యింటికి అది రెండు మూడురోజుల కూడు అయి వుంటుంది కూడా.

అలాంటి గబ్బుకూడు అమ్మటం ఒక వ్యాపారం పట్టణాల్లో, నగ రాల్లో. పాచిపోయి, వాసన వేస్తున్నా మరింత వస్తుందని దాన్నే తెస్తాడు శివుడు.

తాగినమైకంలో వాడికేం తెలియకపోయినా ఇంట్లోవాళ్ళకూ అల వాటయి పోయింది ఆకూడు తినడం. ఆవురావురుమంటూ తింటారు భార్యా పిల్లలు, ఆకలెత్తిన జంతువులు శవాన్ని పీక్కుతిన్నట్టు.

వారూ మనుషులే! వారివీ బ్రతుకులే. అలా ఎందుకు బ్రతుకు తున్నారో బ్రతకాలో వారికే తెలియదు.

ఒకరోజు ఒక్కశవమూ దొరకలేదు. శివుడికి "సారా" అన్నిటికంటే ముఖ్యమైన సమస్య. సారా కావాలంటే శవం కావాలి అందుకే పిచ్చి పట్టినట్లయింది

ఒకటి రెండు దిక్కులేని శవాలు శివుడు వెళ్ళేటప్పటికి మునిసిపాలిటీ వశమైనాయి. మునిసిపాలిటీని, అందులో పనిచేసేవాళ్ళని చెడతిట్టాడు శివుడు. ఆవాళ తన బ్రతుకులో మట్టి కొట్టారని గోలపెట్టాడు. చివరకు చీకటి పడగానే— ధైర్యంచేసి స్మశానికివెళ్ళి కొత్తగా పూడ్చివున్న ఓ శవాన్ని తవ్వుకొచ్చాడు కుక్కలు తరుముతున్నాయ్ మానోట మట్టి కొట్టావ్ అంటూ తప్పించుకొని పరుగెత్తుకొచ్చాడు. నిధి దొరికినంత ఆనందాన్ని అనుభవించాడు ఆనాటి సారా నిషాలో.

సావు సల్లగా వుండాల. కాదు కడుపునిండాల అంటూ ఏవో పిచ్చి పాటలు పాడుకుంటూ గుడిసె చేరుకున్నాడు. కుక్కిమంచంలో మూలుగు తున్నతల్లి కొడుకుని తిడుతూనేవుంది. అసహ్యించుకుంటునే వుంది

శివుడు శవాలు తెస్తూనే వున్నాడు. పెళ్ళాం పిల్లల్ని కంటూనే వుంది. గబ్బుకూడు తింటూనే వున్నారు.

ఆ రోజు.... శవాలకోసం శివుడు బయలుదేరే సమయానికి కుక్కి మంచంలోని కన్నతల్లి గుటుక్కుమంది, శివుడి గుండె చివుక్కుమంది, మొదటిసారి. కడుపునమోసి కని, పెంచి, పెద్దచేసినతల్లి ఉన్నన్నిరోజులు ఎప్పుడు చస్తుందా అని ఎదురు చూశాడు. తీరా చనిపోయిందని తెలియ గానే విలవిలలాడుతోంది హృదయం. ఎందుకూ?

శవాలతో నిత్యం జీవించే తనకు ఈ శవం మాత్రం ఎందుకు అలా భిన్నంగా కనిపిస్తుందో, కడుపులో అలా ఎందుకు దేవుతుందో అర్థంకాలేదు. సాయంకాలం సారా గుర్తుకు రాలేదు. గబ్బుకూడు ఎట్లా అన్న దిగులు లేదు కడుపంతా మంట. గుండెనిండా బరువు. కొన్ని క్షణాలు అలాగే జీవం లేనట్లు కూర్చుండిపోయాడు శివుడు.

"నీ సెవాన్ని మాత్తరం అమ్మనులేయె. బయపడమాకు. నువ్ మా యమ్మవు నిన్ను నేనే పూడుస్తా మట్లో" శివుడు తల్లితో అన్నమాటలు గుర్తొచ్చాయి. కళ్ళలో నీళ్ళు సుడులు తిరిగాయి.

భార్య పలకరింపుతో తేరుకొని తల్లి— శవాన్ని తీసుకెళ్ళి, స్మశా నంలో పూడ్చి పెట్టాడు. మట్టిని కన్నీళ్ళతో తడిపి, తల్లి శవాన్ని కప్పాడు. దానిమీద కుక్కలకు అందకుండా పెద్ద పెద్ద రాళ్ళను పేర్చాడు.

తిరిగి వస్తూవుంటే ఎంతో దిగులు, ఏదో గుబులు. తల్లి మాటలు— మట్టిలో తల్లి. మనసులో తల్లి శివుడి గుండె చెరువయింది. ఒంటరిగా ఏడ్చుకున్నాడు, కుమిలి కుమిలి—

* * * *

మరునాడు ఉదయం మౌనంగా కూర్చొనివున్నాడు శివుడు, తల్లి లేని కుక్కి మంచాన్ని చూస్తూ—

తాగుబోతు పెద్దమనుషులిద్దరూ వచ్చారు, శవం కావాలని. లేద న్నాడు శివుడు. గద్దించారు వాళ్ళు తల పైకెత్తలేదు శివుడు.

అవాళ సారా, తిండి ఎట్లా? అన్నారు వాళ్ళు ఆందోళనగా, కొంపలు మునిగినట్లు. ఎక్కడికన్నా వెంటనేవెళ్ళి శవాన్ని తీసుకురమ్మ న్నారు. లేకపోతే వ్యాపారం దెబ్బతింటుందని హెచ్చరించారు.

వల్లకాదన్నాడు శివుడు, తల అడ్డంగా తిప్పి, బూతులు తిట్టారు వాళ్ళు, నమ్మి చెడిపోయామని— శివుడు తలపైకెత్తాడు. కళ్ళనిండా నీళ్ళు. ఆ నీళ్ళల్లో కన్నతల్లి రూపం. అమ్మమీద ఒట్టేసుకున్నాడు, యిక శవాలు అమ్మనని.

నానామాటలు అంటూ— ముఖాన ఉమ్మేసి పెద్ద మనుషులు వెళ్ళి పోయారు. ఆరోజు పస్తు శివుడు కుటుంబం. పిల్లలు....పిల్లలతల్లి క్షోభ. ఎవరూ శివుడ్ని అడగలేరు అన్నం కావాలని.

భయం—భయం. సాయంకాలం— యాంత్రికంగా లేచి, అలా నడుచుకుంటూ బయలుదేరాడు శివుడు.

ఒకడు మూటలు మోస్తున్నాడు-ఒకడు చెప్పులు కుడుతున్నాడు. ఒకడు బండి లాగుతున్నాడు. ఒకడు ఇటుకలు మోస్తున్నాడు మరొకడు ఇల్లు కడుతున్నాడు. ఒకడు రిక్షా లాగుతున్నాడు. మరొకడు షోడాలు అమ్ముతున్నాడు. వాళ్ళంతా బ్రతుకుతున్నారు?

అందరినీ చూశాడు శివుడు. ఒక నిర్ణయానికొచ్చాడు. లీలామహల్ సెంటర్ కొచ్చేసరికి—

ఆ తాగుబోతు పెద్దమనుషులు ఒక శవానికి అలంకరించి, డబ్బులు అడుక్కుంటున్నారు. మామూలు సరళిలో. ఆశ్చర్యపోయాడు శివుడు

దగ్గరకెళ్ళి అడిగాడు వాళ్ళను, ఎక్కడిదని? శివుడ్ని ఈసడించు కుంటూ, శ్మశానానికెళ్ళి తెచ్చుకున్నామని చెప్పారు వాళ్ళు. శవంవంక చూశాడు శివుడు. అదిరిపడ్డాడు. అది తన తల్లి శవం.

"అమ్మా" అంటూ శవంమీదవడి భోరున ఏడ్చాడు. తాగుబోతు పెద్దమనుషుల మత్తు వదిలినట్లయింది-ఎవరిదో అనుకొని తెచ్చిన శవం అది. అప్పటికే అడుక్కున్న డబ్బుల్లోంచి ఓ ఐదురూపాయలు ఏరి, శివుడి చేతిలోపెట్టి "నువ్వూ అడుక్కో, లేకపోతే పూడ్చుకో" అంటూ మిగిలిన డబ్బుతో పలాయనం చిత్తగించారు వాళ్ళు. జనం తలా ఒక ధర్మ చేయ సాగారు. నిశ్చేష్టుడై పోయాడు శివుడు. ❋